నేడు రాధా గోవింద రథయాత్ర

మణికొండ: హరేకృష్ణ మూవ్‌మెంట్, హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌ల వారి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గండిపేట చౌరస్తా నుంచి కోకాపేట హెరిటేజ్ టవర్ నిర్మిస్తున్న టవర్ వరకు శ్రీరాధాకృష్ణ రథయాత్ర నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గండిపేట చౌరస్తాలో జరిగే రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో అక్షయపాత్ర ఫౌండేషన్ జాతీయ చైర్మన్ మధుపండిత్ ప్రభూజీ, బ్యాడ్మింటన్ కోచ్, పద్మవిభూషన్ పుల్లెల గోపీచంద్, స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరవుతారని వారు తెలిపారు. గండిపేట చౌరస్తా నుంచి కోకాపేట గ్రామం మీదుగా రథం నిర్మాణంలో ఉన్న హెరిటేజ్ టవర్ సంస్థ వరకు వస్తుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సహజ ప్రసవాలే మేలు



అమెరికా ఎన్‌జీవో ప్రతినిధులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా వైద్యాధికారి

మణికొండ: మహిళలకు సహజ ప్రసవాలే మేలు చేస్తాయని, సిజేరియన్ ప్రసవాలతో వారి ఆరోగ్యానికి ఎంతో కీడు జరుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. నార్సింగి రూరల్ హెల్త్ సెంటర్‌కు అమెరికాకు చెందిన ఆర్‌మాన్ ఎన్‌జీవో ప్రతినిధులు వచ్చారు. వారికి మన దేశం, రాష్ట్రంలో జరుగుతున్న ప్రసవాలు, మహిళల ఆరోగ్యం, వారికి ఇస్తున్న పౌష్టికాహారం, బాలింతలు, పుట్టిన పిల్లల నుంచి ఎదిగే వరకు తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. రాబోయే సమాజాన్ని ఆరోగ్యంగా తయారు చేయాలంటే గర్భిణుల నుంచే అనేక జాగ్రత్తలు, పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు ఎంతో కృషి చేస్తున్నాయని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ సృజన, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మలతో పాటు ఏఎన్‌ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశ్‌గౌడ్‌కు అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సరోజిని, లక్ష్మీశ్రీ

బండ్లగూడ: రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా ప్రకాషగౌడ్ 4వ సారి భారీ మెజార్టీతో గెలుపొందడంతో కార్యకర్తలు, బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఉదయం ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన నాయకులు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ గడ్డపై 4వ సారి విజయం సాధించడం చాలా ఆనందంగా ఉందని, నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తన విజయానికి సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్ పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ నాయకులు గోపాల్ ముదిరాజ్, పాపయ్య యాదవ్, నర్సింహగౌడ్, రాజురెడ్డి, దశరథ్, కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్

మణికొండలో...

మణికొండ: వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన టి. ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు, సన్మానాలు వెల్లువెత్తున్నాయి. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యూష చారిటబుల్ సంస్థ చైర్‌పర్సన్ సరోజిని, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షురాలు లక్ష్మీశ్రీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో రాబోయే ఐదేళ్లల్లో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.

జన్మదిన వేడుకలు



ప్రేమ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో ఎళ్లప్పుడూ అందుబాటులో ఉంటున్నానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టి. ప్రేమ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రేమ్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తున్నానన్నారు.

మురుగు సమస్యకు చెక్

- స్పందించిన జలమండలి అధికారులు
- రెండు చోట్ల మ్యాన్‌హోళ్ల నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీ రోడ్లపై గత కొన్ని రోజులుగా మురుగు పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో శుక్రవారం సాక్షి దిన పత్రికలో ప్రచురించిన రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా..? అనే శీర్షిక ప్రచురితం జరిగింది. దీంతో జలమండలి అధికారులు వెంటనే స్పందిచారు. కాలనీలోని మురుగు నీటి సమస్య పరిష్కారానికి రెండు చోట్ల నూతన మ్యాన్ హోల్ నిర్మించారు. కొన్ని మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కూడా స్పందించి అధికారులతో మాట్లాడారు. మురుగు నీరు రోడ్లపై పారకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మురుగు సమస్య ఉన్న గల్లీలలో స్థానికులు ఫోన్ ద్వారా నా దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి సమస్య పరిష్కరించడానికి మా పై అధికారులకు తెలిపి సమస్య తలెత్తకుండా చూస్తానని జలమండలి సూపర్ వైజర్ వినయ్‌కుమార్ తెలిపారు. మురుగు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సాక్షి దిన పత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



మ్యాన్‌హోల్‌ను క్లీన్ చేయిస్తున్న జలమండలి సూపర్ వైజర్ వినయ్‌కుమార్



డ్రైనేజీ శుభ్రం చేసిన తర్వాత..

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్: అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో జీవో 111 నిబంధనలకు వ్యతిరేకంగా భారీ ఎత్తున అక్రమ కట్టడాలు జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రైతుల పొలాల మధ్య వివాదాస్పద భూములైన 103 సర్వేనంబర్లలో ఎనిమిదెకరాల చొప్పుల ఫాంహౌస్‌లు నిర్మాణం జరుగుతున్న వాటిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. చర్యలు తీసుకుంటానని చెప్పిన కమిషనర్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నాడన్నారు. ప్రస్తుతం అక్కడ నిర్మాణాలు కూడా పూర్తవుతున్నాయన్నారు. పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల్లో మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోని పక్షంలో సీఎం ప్రజాదర్బార్‌లో సమస్యను వివరించి పరిష్కరించుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేందర్

చిత్రపురి అక్రమాలపై ఫిర్యాదు

మణికొండ: తమకు కేటాయించిన గృహాలను తమకు ఇవ్వకుండా ఇతరులకు అమ్ముకుంటూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిత్రపురి బాధితుడు భాస్కర్‌రావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కోఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీలో అనేక అక్రమాలు జరిగాయని, వాటి విషయంలో గత ప్రభుత్వ పెద్దలను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని అదే విషయాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆయన మీడియాతో పేర్కొన్నారు. తన లాంటి వాళ్లు వందల సంఖ్యలో ఉన్నారని, వారికి కేటాయించిన గృహాలను ఇతరులకు అమ్ముకునే అధికారం సొసైటీ కమిటీకి ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరామని, దాన్ని సీరియస్‌గా పరిశీలించి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చాడని ఆయన పేర్కొన్నారు.

'నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా'

చాంద్రాయణగుట్ట: ఆరోసారి తనను బంపర్ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఉప్పుగూడ డివిజన్‌లోని ఫూల్‌బాగ్, నర్కీపూల్ బాగ్ బస్తీల్లో శుక్రవారం ఆయన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ఇంటింటికీ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కచేరీలో గీతాలను ఆలకించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కొన్ని పార్టీల నాయకులు వచ్చి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎంతో అభివృద్ధి చేశామని.. మున్ముందు కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా ముస్లింలు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటింగ్ శాతం పెంచేందుకు ముందుకు రావాలన్నారు.

కళా సంస్థలను ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కళా సంస్థలకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని పలువురు కళాకారులు కోరారు. శుక్రవారం సీడ్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. కళాకారులు, కళలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

సాంకేతికతతో మరింత అభివృద్ధి



ఐటీ ప్రాజెక్టులను తిలకిస్తున్న విద్యార్థినులు

మణికొండ: ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న సాంకేతికతో మానవ జీవితాలు మారిపోతున్నాయని, వారి జీవన విధానంలో ఎంతో మార్పులు వస్తున్నాయని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధి, వట్టినాగులపల్లిలో ఉన్న కళాశాలలో శుక్రవారం ఐటీ విభాగం ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఎక్స్ పో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితిలో తమ చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్‌లలో ఉన్న యాప్‌ల ద్వారా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, కొనుగోళ్లు తీరుతున్నాయన్నారు. అలాంటి సాంకేతికతకు ప్రజలు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త యాప్‌లతో పాటు సాఫ్ట్‌వేర్‌లను కనుగొనాల్సిన బాధ్యత యువ ఇంజినీర్‌లపై ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో వినూత్నమైన, ఎమర్జింగ్ టెక్నాలజీలను విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటీ హెచ్‌ఓడీ, కన్వీనర్ డాక్టర్ బి.నరేంద్రకుమార్, అకాడమిక్ డీన్‌లు, డైరెక్టర్ ఎవాల్యుయేషన్, ఇతర విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఎంబీటీ మద్దతు

చార్మినార్: ఈ ఎన్నికల్లో ఎంబీటీ పార్టీ తరఫున మాజీ కార్పొరేటర్ అంజదుల్లా ఖాన్ తమ పార్టీకి పూర్తిగా సహకరించిందని.. అలాగే రాబోయే ఎన్నికల్లో కూడా తమకు పూర్తిగా మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా చార్మినార్ నియోజకవర్గం నుంచి కూడా ఎంబీటీ తరఫున తనకు పూర్తిగా మద్దతు తెలిపినందుకు అంజదుల్లాఖాన్‌ను చంచల్‌గూడలోని పార్టీ కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలియజేసినట్లు ముజీబ్ ఉల్లా షరీఫ్ తెలిపారు.

బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లతో శుక్రవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారిణి రాధారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఉప కమిషనర్ రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలతో పాటు సూపర్‌వైజర్లకు ఓటర్ల ముసాయిదా సవరణపై సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఓటర్ల జాబితాలో పేర్లు, ఇంటి చిరునామా మార్పు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు, ఒకే వ్యక్తిపై రెండు, మూడు ఓట్లు ఉన్న వాటిని తొలగించడం, ఒకే కుటుంబ సభ్యుల ఓట్లను ఒకే పోలింగ్ బూత్‌లో పొందుపరచడం, పోలింగ్ బూత్‌ల మార్పు తదితర వాటిపై సవరణకు అవకాశం ఇచ్చిందన్నారు. అలాగే కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ ప్రక్రియను ముమ్మరం చేస్తున్నామన్నారు. ఓటర్లు తమ బీఎల్‌ఓలను సంప్రదించి మార్పులు, ఇతర చేరికలు ఏమైనా ఉంటే పొందుపరుచుకోవాలని సూచించారు. జనవరిలో తుది జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బూత్‌ల వారీగా బీఎల్‌ఓలు అందుబాటులో ఉన్నారన్నారు. బీఎల్‌ఓలతో పాటు సూపర్‌వైజర్లను సంప్రదించాలన్నారు.

'ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి రాణిస్తారు'



బటర్‌ఫ్లై కూడలిలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు

మణికొండ: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి రాణించటంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం. జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, కౌన్సిలర్ బి.పద్మారావు అన్నారు. గురువారం ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటంతో రాత్రి మణికొండ బటర్‌ఫ్లై(చింతచెట్టు) చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సమస్యలపై అవగాహనతో పాటు వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపైనా ఆయనకు స్పష్టత ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి ప్రజారంజక పాలన అందిస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రభావతిలతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థినులను అభినందిస్తున్న సీబీఐటీ ప్రిన్సిపాల్ నరసింహులు

మణికొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు అన్నారు. రాష్ట్ర స్థాయి ఇంజినీరింగ్ కళాశాలల క్రీడా పోటీల్లో బాస్కెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినులను ఆయన శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొంటే శారీరక శ్రమ కలిగి మెదడు, శరీరం చురుకుగా ఉంటుందన్నారు. క్రీడలతో మంచి గుర్తింపు వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని పథకాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీలు బి. శ్రీనివాస్‌రెడ్డి, డి. కృష్ణారెడ్డి, డి. రామన్, ఎ.రజినీకాంత్, సహాయ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ రాజు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

అత్తాపూర్: దొరల అహంకారం ప్రజల ఆలోచనలకు పరిగణలోకి తీసుకోకపోవడమే బీఆర్‌ఎస్ పార్టీని గద్దెదించి సెక్యులర్ పార్టీ కాంగ్రెస్‌ను గెలిపించారని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు జి.ప్రవీణ్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి తుల్జాపూర్‌లోని తుల్జా భవానీమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీపాల్ రెడ్డి, సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.



తుల్జా భవానీ అమ్మవారి పూజల్లో పాల్గొన్న నాయకులు